
సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 3 । నవంబర్ । 2024



ఐఐపీఈ విస్తరణ 8లో

ఐఐపీఈను ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దేందుకు పాతికేళ్ల విస్తరణ ప్రణాళికను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.



కన్నీటితో సమాధుల పండగ

చనిపోయిన తమ కుటుంబ సభ్యుల ఆత్మలకు శాంతి కలగాలని శనివారం జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు ఆత్మల పండగ నిర్వహించారు. 8లో



'అగర్తలా–సికింద్రాబాద్' వన్ వే

అగర్తలా–సికింద్రాబాద్ మధ్య వన్‌వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

'జూ లోపలకు బాణసంచా తీసుకురావద్దు'



ఆరిలోవ: నాగులచవితి రోజున జూలోని పుట్టల్లో పాలు పోసేందుకు వచ్చే వారు ఎలాంటి బాణసంచా తీసుకురావద్దని జూ ఇన్‌చార్జ్ క్యూరేటర్ జి.మంగమ్మ శనివారం ఓ ప్రకటనలో సూచించారు. ఈ నెల 5న నాగులచవితి పురస్కరించుకుని జూ పని వేళల్లో మార్పులు చేసినట్లు తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జూ పార్క్ తెరిచి ఉంటుందని, నిబంధనల ప్రకారం బాణసంచా లోపలకు తీసుకురావడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి బాణసంచా పేల్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమానా విధిస్తామని ఆమె హెచ్చరించారు.

'అపార్'తో ప్రయోజనాలు



మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

ఆరిలోవ: అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)తో విద్యార్థులకు విస్తృత ప్రయోజనాలు ఉన్నాయని ఆర్జేడీ విజయభాస్కర్, డీఈవో ప్రేమ్‌కుమార్ అన్నారు. సెయింట్ ఆన్స్ పాఠశాలలో శనివారం చినగదిలి, భీమిలి మండలాల్లోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులకు 'అపార్'పై అవగాహన కల్పించారు. విద్యార్థుల అడ్మిషన్ నంబర్‌కు ఆధార్ నంబర్, బర్త్ సర్టిఫికెట్ వివరాలను జత చేయాలని సూచించారు. ప్రతీ విద్యార్థి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇటీవల జరిగిన ఎఫ్‌ఏ–1 మార్కులను కూడా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్: మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన విధానం వెరసీ మహిళల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నట్లు విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో విశాఖ జిల్లా న్యాయవాదుల సంఘం, విశాఖ మహిళా న్యాయవాదుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ పరిశోధన వైద్య సేవా కేంద్రం నిర్వహించిన మహిళా క్యాన్సర్ ప్రాథమిక పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ నేడు మహిళలు పురుషులతో పాటు సమానంగా పనిచేయడం, కుటుంబ నిర్వహణ సమర్థవంతంగా చేస్తున్నారన్నారు. క్యాన్సర్ పరిశోధన చికిత్స కేంద్రం ప్రధాన వైద్యుడు వి.ప్రవీణ మాట్లాడుతూ మహిళలు బెస్ట్ క్యాన్సర్ విషయంలో అప్రమత్తత అవసరమన్నారు. మహిళా న్యాయవాదుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు అనురాధ మాట్లాడుతూ నిర్లక్ష్యం వహిస్తే నిండు ప్రాణానికే ముప్పుగలిగే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. మెట్రోపాలిటీ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ, కేంద్ర నేర అన్వేషణ ప్రత్యేక న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జి.గాయత్రి, న్యాయవాదుల సంఘం కార్యదర్శి డి.నరేష్, సీనియర్ న్యాయవాదులు లక్ష్మీ రాంబాబు, హేమమాలిని, న్యాయవాదులు పాల్గొన్నారు. డాక్టర్ సుభద్ర దేవి తదితరులు వైద్య సేవలు అందించారు.

నెట్‌బాల్ ఉమ్మడి విశాఖ జట్టు ఎంపిక



ఎంపికైన ఉమ్మడి విశాఖ నెట్‌బాల్ జట్టు

అగనంపూడి: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) నెట్‌బాల్ ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు ఎంపికను కణితి ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం చేపట్టారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి నెట్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులను ఉమ్మడి విశాఖ జట్టుగా ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనుందని నిర్వాహకులు తెలిపారు. వార్డు కార్పొరేటర్ బొండా జగన్, ఉక్కు కార్మిక సంఘం నాయకులు విందుల వెంకటరమణ, హెచ్‌ఎం సూర్యప్రకాశరావు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆస్తులపై బాదుడు..!



డిసెంబర్‌లో మార్కెట్ విలువ పెంపునకు సన్నాహాలు?

- భూముల విలువ సవరణ చేపట్టాలని ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు
- రెండు నెలలుగా రిజిస్ట్రేషన్ అధికారుల కసరత్తు
- ప్రాంతాలను బట్టి 20 నుంచి 60 శాతం పెంచాలని ఆలోచన
- భూముల విలువ, రిజిస్ట్రేషన్స్ చార్జీలు పెంచి సంపద సృష్టిపై ప్రభుత్వం దృష్టి
- మరో రెండు వారాల్లో ప్రభుత్వం నుంచి విధి విధానాలు వచ్చే అవకాశం

విశాఖ సిటీ: ఎన్నికలకు ముందు రాష్ట్ర సంపద సృష్టిస్తామని గప్పాలు కొట్టిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక ప్రజల నడ్డి విరిచి ప్రభుత్వ ఖజానా నింపడానికి సిద్ధమవుతున్నారు. ఒక సంక్షేమ పథకాన్ని ఎరగా వేసి.. మూడు వైపులా ముక్కు పిండి రెట్టింపు స్థాయిలో రాబట్టుకొనే ప్లాన్ వేస్తున్నారు. కేవలం తెల్లరేషన్ కార్డుదారులకు మూడు ఉచిత సిలిండర్లు ఇచ్చి.. మద్యం, విద్యుత్, రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రజల జేబులు ఖాళీ చేసే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే మద్యం ధరలు మందుబాబులకు చుక్కలు చూపిస్తుండగా.. మరో నెల రోజుల్లో విద్యుత్ బిల్లులు షాక్ కొట్టనున్నాయి. డిసెంబర్ నుంచి భూముల విలువ కూడా అమాంతం పెరిగి మధ్యతరగతి సొంతింటి కల చెరిగిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. త్వరలో భూముల విలువ సవరణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. సంపద సృష్టి కోసం రిజిస్ట్రేషన్ ధరలు భారీగా పెంచాలని భావిస్తోంది. భూముల విలువతో పాటు రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ, ఇతరత్రా చార్జీలను సైతం పెంచే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.


60 శాతం వరకు పెంపు..!

ప్రభుత్వ ఆదేశాలతో రిజిస్ట్రేషన్ అధికారులు భూముల మార్కెట్ విలువ సవరణకు అంచనాల ముసాయిదాను సిద్ధం చేశారు. వాస్తవానికి భూముల మార్కెట్ విలువ సవరణ విషయంలో శాస్త్రీయబద్ధంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వ ఆదేశాలతో విశాఖ రూరల్, భీమిలి, ఆనందపురం, పెందుర్తి, గాజువాక ప్రాంతాల్లో భారీగా భూములు విలువ పెంచడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కనిష్ఠంగా 20 శాతం నుంచి గరిష్ఠంగా 60 శాతం వరకు విలువ పెంచే అవకాశాలు ఉన్నట్లు అధికారులు సైతం భావిస్తున్నారు. ఇప్పటి వరకు నివాసిత, వాణిజ్య భూముల విషయంలోనే ఎక్కువగా పెంచుతూ వచ్చారు. ఈసారి మాత్రం కూటమి ప్రభుత్వం వ్యవసాయ భూముల విలువను సైతం గణనీయంగా పెంచే ఆలోచన చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వీటి విలువ కూడా గరిష్ఠంగా 40 శాతం వరకు పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. కమర్షియల్, జాతీయ రహదారికి ఆనుకొని ఉంటే భూముల విలువ రెట్టింపు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

రెండు నెలలుగా కసరత్తు

భూముల మార్కెట్ విలువ సవరణపై నివేదిక తయారు చేయాలని ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు రెండు నెలల క్రితమే మౌఖిక ఆదేశాలు ఇచ్చింది. సవరణ ప్రతిపాదనలతో సిద్ధంగా ఉండాలని చెప్పింది. దీంతో ఆ దిశగా జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖాధికారులు రహస్యంగా కసరత్తు ప్రారంభించారు. క్షేత్ర స్థాయిలో మార్కెట్ ధరలపై స్థానిక సంస్థల అధికారులతో కలిసి విలువ ప్రతిపాదనలను సిద్ధం చేశారు. అయితే ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో విధి విధానాలు, మార్గదర్శకాలు వచ్చిన వెంటనే ఆ ప్రతిపాదనలకు తుది మెరుగులు దిద్దనున్నారు. మరో రెండు వారాల్లో ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు రిజిస్ట్రేషన్ అధికారులు భావిస్తున్నారు.

విశాఖ నుంచి రూ.700 కోట్లు లక్ష్యం



రాష్ట్ర ఖజానాకు విశాఖ అత్యంత కీలకంగా మారింది. అన్ని శాఖలతో పాటు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి కూడా జిల్లా నుంచే అత్యధిక ఆదాయం సమకూరుతోంది. ఏటా భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.500 కోట్లు నుంచి రూ.600 కోట్లు వరకు ఆదాయం వస్తోంది. 2023–24లో రూ.731.69 కోట్ల లక్ష్యానికి గాను రూ.504.82 కోట్లు ఆదాయం సమకూరింది. తరువాత ఎన్నికల ఏడాది కావడంతో ఆ ప్రభావం రిజిస్ట్రేషన్లపై పడింది. దీంతో ఈ ఏడాది రూ.600 కోట్లు దాటలేదు. అయితే భారీగా భూముల విలువ పెంచడం ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.700 కోట్లకు పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది.

గత ప్రభుత్వంలో రెండు సార్లే..

టీడీపీ ప్రభుత్వం ఆదాయం పెంపు కోసం గతంలో మాదిరిగానే రిజిస్ట్రేషన్ ధరలు భారీగా పెంచేందుకు సిద్ధమవుతోంది. 2014–19 మధ్య నాలుగు సార్లు భూముల విలువ సవరణ చేసింది. 2019 నుంచి 2024 మధ్య వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేవలం రెండు సార్లు మాత్రమే ధరలు పెంచారు. కోవిడ్ కష్టకాలంలో రాష్ట్ర ఖజానాకు రూపాయి ఆదాయం రాని సమయంలో కూడా రిజిస్ట్రేషన్ ధరలు పెంచలేదు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ఆదాయం కోసం మళ్లీ ప్రజలపై భారం మోపాలని నిర్ణయించింది.

చెదిరిపోనున్న సొంతింటి కల



విశాఖలో ఇప్పటికే భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నగర శివారు ప్రాంతాల్లో సైతం గజానికి రూ.25 వేలకు పైగా వెచ్చించాల్సి వస్తోంది. దీంతో వంద గజాల స్థలానికే రూ.25 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటోంది. తాజాగా రిజిస్ట్రేషన్ విలువతో పాటు స్టాంప్ డ్యూటీ, ఇతరత్రా చార్జీలు పెరిగితే అదనంగా 5 నుంచి 8 శాతం ధర పెరిగే అవకాశముంది. ఇది మధ్య తరగతిపై తీవ్ర భారం పడనుంది. అలాగే భూముల ధరల పెంపు ప్రక్రియ రియల్ ఎస్టేట్‌కు దెబ్బపడేలా కనిపిస్తోంది. దీంతో ప్రభుత్వ నిర్ణయం ఇటు మధ్యతరగతిపైనే కాకుండా స్థిరాస్తి రంగంపై కూడా తీవ్ర ప్రభావం చూపించే అవకాశముంది.

ప్రజల పక్షాన నిలబడిన సాయిబాబాను చంపేశారు

పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలక చంద్రశేఖర్



మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలక చంద్రశేఖర్

సీతంపేట: ప్రజల పక్షాన నిలబడినందుకే ప్రొఫెసర్ సాయిబాబాను కేంద్రంలోని మనువాద ప్రభుత్వం చంపేసిందని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలక చంద్రశేఖర్ ఆరోపించారు. పౌర ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం ఆచార్య సాయిబాబా స్మృతి సదస్సు జరిగింది. ముందుగా సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పించారు. ఆపరేషన్ కగార్ అంశంపై చంద్రశేఖర్ ప్రసంగిస్తూ ప్రజల పక్షాన నిలబడిన వారిపై కేంద్ర ప్రభుత్వం కక్ష కట్టిందని, దానికి సాయిబాబా బలైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో పదో తరగతి అర్హత ఉన్న వారికి ప్రభుత్వమే తుపాకులు అందజేసి గిరిజనులకు అండగా నిలిచిన వారిపై కాల్పులు చేయిస్తోందని విమర్శించారు. మోదీ, అమిత్‌షా వచ్చిన తర్వాత ఉప చట్టాన్ని మరింత కఠినతరం చేసి హక్కుల నేతల గొంతు నొక్కేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే చట్టాలు తీసుకువచ్చి సాయిబాబాను పదేళ్ల జైల్లో ఉంచి చంపేశారన్నారు. హైదరాబాద్ సల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మురళీ 'మూడు క్రిమినల్ చట్టాలు' అనే అంశంపై మాట్లాడారు. సాయిబాబా విడుదల కోసం చట్టప్రకారం పోరాటం చేసిన ఇద్దరు ప్రొఫెసర్లు జైల్లో ఉన్నారని గుర్తుచేశారు. ఏడాదికి 74 లక్షల ఎఫ్‌ఐఆర్‌లు నమోదు అవుతున్నాయని, సుమారు 6 లక్షల మంది అరెస్ట్ అవుతున్నారన్నారు. భారతీయ జైళ్లలో 88 శాతం మంది దిగువ వర్గానికి చెందిన వారే ఉన్నారన్నారు. విరసం నేత కృష్ణ మాట్లాడుతూ కోనసీమ జిల్లాలోని చిన్న గ్రామంలో సాయిబాబా జన్మించారని, హక్కుల మేధావిని మావోయిస్టుగా ముద్ర వేసి జైలుకి పంపారన్నారు. మహిళా న్యాయవాది పద్మ మాట్లాడుతూ సాయిబాబాను హత్య చేసేంత వరకు పాలకులు నిద్రపోలేదన్నారు. మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జె.వి.సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మీ, డాక్టర్ కొల్లా రాజమోహన్, భారత నాస్తిక సమాజం టి.శ్రీరామమూర్తి, ఇప్పు వెంకటేశ్వర్లు, పలు ప్రజా సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సుదీర్ఘంగా... సుత్తి!

- ఐదేళ్ల క్రితం మాటల్నే వల్లెవేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాత్రి 10 గంటల వరకూ సమీక్ష పేరుతో శిక్ష
- విజన్.. విజన్ అంటూ విసిగించిన సీఎం
- ప్రతి విషయానికీ అధికారులపై చిర్రుబుర్రులు

సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట: 2014–19లో చెప్పిన మాటలే.. సుదీర్ఘంగా సమీక్ష పేరుతో మరోసారి వల్లెవేశారు. విజన్ విజన్ అంటూ రాత్రి 10 గంటల వరకూ సీఎం చంద్రబాబు చేసిన సమీక్ష అధికారులకు శిక్షలా మారింది. ప్రతి విషయానికీ అధికారుల వివరణ ఇస్తున్నా పట్టించుకోకుండా చిర్రుబుర్రులాడుతూ అభివృద్ధిపై ఏదో దీర్ఘకాలిక ప్రణాళిక ఉందన్నట్లుగా హడావుడి చేశారు.

శనివారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత విశాఖ వచ్చిన చంద్రబాబు.. సాయంత్రం 5.40 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అప్పటి నుంచి విశాఖ మెట్రో ప్రాజెక్టు, మాస్టర్ ప్రణాళిక, నీతి ఆయోగ్ గ్రోత్ హబ్, రోడ్ల అనుసంధానం, తదితర అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. 1995లో సీఎం అయినప్పటి నుంచి చెబుతున్నట్లుగానే ఈసారి కూడా విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తాను.. విశాఖ అంటే నాకు అపారమైన ఇష్టమంటూ చర్విత చరణంగా మాట్లాడటంపై అధికారులు విసుక్కున్నారు. హుద్‌హుద్ సమయంలో చేసిన విషయాలను సమీక్షలో ఎందుకు చెబుతున్నారో తెలియక అధికారులు తలలు పట్టుకున్నారు. నగరంలో పార్కులు ఏర్పాటు చేయాలని ఆదేశించగా.. ఇప్పటికే గత ఐదేళ్లలో అభివృద్ధి చేసిన పార్కుల వివరాలను అధికారులు వివరిస్తే.. దానిపై అసహనం వ్యక్తం చేస్తూ కొత్తగా పార్కులను ఆధునికీకరించాలంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అదే విధంగా గుంతలు లేని రోడ్లు వీలైనంత త్వరగా చూడాలని చెప్పగా.. ఇప్పటి వరకు నిర్మించిన రహదారులు, మరమ్మతుల వివరాలు చెప్పేందుకు ప్రయత్నించిన అధికారులపైనా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. మెట్రో ప్రాజెక్టుకు డీపీఆర్ సిద్ధమై.. కేంద్రానికి పంపించినా కొత్తగా మళ్లీ డీపీఆర్ సిద్ధం చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఇలా.. ప్రతి అంశంపైనా చర్చిస్తున్న సమయంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనుల్ని వివరించేందుకు అధికారులు ప్రయత్నించారు. వాటిని పట్టించుకోకుండా తమ ప్రభుత్వ హయాంలో చేపట్టాల్సిన పనులపైనే దృష్టి సారించాలంటూ చంద్రబాబు హుకుం జారీ చేశారు. హైదరాబాద్ మాదిరిగా విశాఖని అభివృద్ధి చేస్తానని.. 2047 విజన్ డాక్యుమెంట్ ప్రకారం 15 శాతం వృద్ధి సాధించే దిశగా సాగాలని ఆదేశించారు. 2025 లేదా 2026 నాటికి భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వచ్చే నాటికి అన్ని అభివృద్ధి ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. సమీక్షలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

మంత్రులపై ఎమ్మెల్యేల అసహనం..!

వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో శనివారం ఉదయం మంత్రులు నారాయణ, డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సమీక్ష నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష జరిగింది. దీనికి తమను ఆహ్వానించకపోవడంపై ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేశారు. తాము విశాఖ జిల్లా పరిధిలో లేమా..? జీవీఎంసీకి చెందిన ఎమ్మెల్యేలం కాదా అంటూ మంత్రి నారాయణని నిలదీశారు. ఎందుకు ఆహ్వానించలేదో చెప్పాలని ప్రశ్నించారు. దీనిపై ఇన్‌చార్జి మంత్రి సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. ఈ విషయాన్ని రుషికొండ వద్ద సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ శ్రీ భరత్, మంత్రులు కలిసి తమని దూరం పెడుతున్నారంటూ ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన బాబు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని మంత్రి నారాయణని హెచ్చరించినట్లు తెలుస్తోంది. రాత్రి 10.30 గంటల తర్వాత టీడీపీ కార్యాలయానికి చేరుకొని కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు.

వీధి దీపాల నిర్వహణను మెరుగుపరచండి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ, వీఎంఆర్డీఏ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోల బాలా వీరాంజనేయ స్వామి శనివారం సమీక్ష నిర్వహించారు. వీఎంఆర్డీఏ కార్యాలయంలో జరిగిన సమీక్షలో ముందుగా జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అన్న క్యాంటీన్ల నిర్వహణ, 100 రోజుల చర్యల ప్రణాళిక, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, పీపీపీ ప్రాజెక్ట్ పనుల ప్రతిపాదనలు, తదితర అంశాలపై మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల నిర్వహణలో లోపం లేకుండా చర్యలు చేపట్టాలని, వంద రోజుల చర్యల ప్రణాళికలో భాగంగా తాగునీటి సరఫరాలో గుర్తించిన లోపాలను సరిచేయాలని ఆదేశించారు. ప్రజలు వ్యక్తిగత నీటి కుళాయిలు తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. కాలువల్లో కలుస్తున్న తాగునీటి పైపులైన్లు మొత్తం 398 ఉండగా.. 375 పైపులైన్లను సరిచేశారని, మిగిలినవి కూడా వెంటనే పూర్తి చేయాలన్నారు. వీధి దీపాల నిర్వహణలో ఎక్కడా లోపం ఉండకూడదని స్పష్టం చేశారు. జీవీఎంసీ రెవెన్యూ విభాగం వివిధ పన్నులు, నీటి చార్జీల వసూలు ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా బిల్డింగ్ ప్లాన్లు, లేఅవుట్లను పరిశీలించి వెంటనే అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. ఎంపీ భరత్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, ఏపీ టిడ్కో ఎండీ సునీల్‌కుమార్, మెప్మా ఎండీ తేజ్ భరత్, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అండ్ చీఫ్ మరియన్న, డీటీసీపీ డైరెక్టర్ ఆర్‌జే విద్యుల్లత, జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ పి.శివప్రసాద్‌రాజు, వీఎంఆర్డీఏ జేసీ కె.రమేష్, అదనపు కమిషనర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి నారాయణ

రూ.6.83 కోట్లతో 2,009 గుంతలు పూడ్చాం

డాబాగార్డెన్స్: వాహనచోదకులకు ఇబ్బందులు లేకుండా ప్రతీ రోడ్డులో గుంతలు పూడ్చుతున్నట్లు మంత్రి పి.నారాయణ తెలిపారు. సిరిపురం దత్ ఐల్యాండ్ జంక్షన్ వద్ద జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి గుంతలు పూడ్చారు. నగరంలో 4,441 గుంతలు గుర్తించామని, ఇప్పటి వరకు 2,009 గుంతలను రూ.6.83కోట్లతో మరమ్మతులు చేసినట్లు చెప్పారు. విశాఖ నగరాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని మంత్రి తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం



హాజరైన వివిధ జిల్లాల ఖోఖో క్రీడాకారులు

అనకాపల్లి: తుమ్మపాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 రాష్ట్రస్థాయి బాలబాలికల ఖోఖో పోటీలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో ఉమ్మడి 13 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన క్రీడాకారులకు సోమవారం బహుమతులు అందజేయనున్నారు. ఉత్తమ క్రీడాప్రతిభ కనబర్చిన వారిని జాతీయ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తారు. ఏపీ క్రీడా ప్రాధికారిక సంస్థ రాష్ట్ర చైర్మన్ ఎ.రవినాయుడు ,ఉపవిద్యాశాఖ అధికారి అప్పారావు, తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, ఖో ఖో రాష్ట్ర పర్యవేక్షకుడు రాధాకృష్ణ, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి మోటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. నృత్యోత్సవం



నాట్య గురువు అరుణా పరమేష్‌ను సత్కరిస్తున్న నృత్య కళాకారులు, వారి తల్లిదండ్రులు

మద్దిలపాలెం: సంయుక్త మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ నృత్య కళాకారుల విన్యాసాలు అబ్బురపరిచాయి. మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం శ్రీహరిపురానికి చెందిన సంయుక్త మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ 7వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. నాట్య గురువు అరుణా పరమేష్ ఆధ్వర్యంలో సుశిక్షితులైన 36 మంది చిన్నారులు కృతులకనుగుణమైన హావభావాలతో నాట్య కచేరీని ఆద్యంతం రక్తి కట్టించారు. సనాతన సంప్రదాయాలను ఒడిసిపట్టి అపురూపంగా ప్రదర్శించిన చిన్నారుల నైపుణ్యాలు రసజ్ఞులైన ప్రేక్షక హృదయాలను దోచుకున్నాయి. గణేశ శ్లోకంతో ఉత్సవ ప్రదర్శనలకు శ్రీకారం చుట్టగా.. 16 మంది సీనియర్ విద్యార్థినులు అద్భుతంగా ప్రదర్శించారు. డాక్టర్ వెంపటి చిన సత్యం నృత్యపరికల్పన చేసిన బ్రహ్మాంజలి(ఆదితాళం, రాగమాలిక)కి 20 మంది నర్తకీమణులు చక్కటి సమన్వయంతో చూడ ముచ్చటగా నృత్యప్రదర్శన సాగింది. అన్నమాచార్య సంకీర్తనలకు బాలల నాట్య ముద్రలు, అభినయ కౌశలం ప్రేక్షకుల హర్షధ్వానాలందుకున్నాయి. ది డ్యాన్స్ ఇండియా ఆంగ్ల మాసపత్రిక సంపాదకుడు బత్తిన రంగ విక్రమ్ కుమార్, వాడా వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కన్నం వి.రమణారావు, నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి కె.వి.లక్ష్మి తొలుత జ్యోతి ప్రజ్వలనలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రదర్శన అనంతరం విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు బహూకరించారు. విద్యార్థినులు తమ తల్లులతో కలసి నాట్య గురువు అరుణా పరమేష్‌ను ఘనంగా సత్కరించారు.

మెట్రో కెమ్ పరిశ్రమలో ప్రమాదం

- కెమికల్ రియాక్షన్ వల్ల చెలరేగిన మంటలు
- మంటలు అదుపు చేసిన ఫైర్ సిబ్బంది



పరిశ్రమ బయట ఉన్న ఉద్యోగులు

పరవాడ: పరవాడ ఫార్మాసిటీలోని మెట్రో కెమ్ ఏపీఐ పరిశ్రమలో ప్రమాదం జరిగింది. శనివారం రాత్రి 9.10 గంటల సమయంలో ఏ– బ్లాక్‌లో కెమికల్ రియాక్షన్ వల్ల మంటలు చెలరేగాయి. దీంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న కార్మికులు పరుగులు తీశారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ సత్యనారాయణ, సీఐ ఆర్.మల్లికార్జున రావు ప్రమాద స్థలానికి చేరుకొని పరిశీలించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ప్రమాద ఘటనపై ఆరా తీశారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని పోలీసు అధికారులు వెల్లడించారు. పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

సాక్షి ఫొటోగ్రాఫర్ నవాజ్‌కు అభినందన



నవాజ్‌ను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

విశాఖ సిటీ: ప్రపంచ ఫొటో జర్నలిజం దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో అవార్డు, బంగారు పతకం, ప్రశంసా పత్రాన్ని అందుకున్న సాక్షి ఫొటోగ్రాఫర్ ఎండీ నవాజ్‌ను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అభినందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి సౌజన్యంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన పోటీలో ఫెస్టివ్ సెలబ్రేషన్స్ థీమ్‌లో తృతీయ స్థానం లభించింది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ కె.మన్మథరావు చేతుల మీదుగా నవాజ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం ఎంవీపీలో గల పార్టీ కార్యాలయంలో గుడివాడ అమర్‌నాథ్, ఇతర నాయకులు నవాజ్‌ను అభినందించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అగర్తలా-సికింద్రాబాద్ మధ్య వన్ వే స్పెషల్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం అగర్తలా-సికింద్రాబాద్ మధ్య వన్‌వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. అగర్తలా-సికింద్రాబాద్(05629) వన్ వే స్పెషల్ ఈ నెల 3వ తేదీ ఉదయం 6.20 గంటలకు అగర్తలాలో బయల్దేరి మంగళవారం (5వ తేదీ) తెల్లవారు 3.35 గంటలకు దువ్వాడకు అదేరోజు సాయంత్రం 4.15 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది.

స్కూల్ వివాదంపై నివేదిక ఇవ్వండి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లే అవుట్‌లోని స్టెల్లా మేరీస్ స్కూల్ వివాదంపై సమగ్ర నివేదిక అందజేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ శనివారం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు కమిషన్ సభ్యుడు గొండు సీతారాం వెల్లడించారు. బాణసంచాపై అవగాహన పేరిట నిర్వహించిన ప్రదర్శనలో విద్యార్థులను భాగస్వామ్యులను చేసేందుకు విద్యా, పోలీసు శాఖల నుంచి ముందస్తు అనుమతులు తీసుకున్నారా? లేదా అనే విషయాన్ని స్పష్టం చేయాలన్నారు. ఈ ప్రదర్శనపై ఇరు వర్గాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుల వరకు వెళ్లినందున.. ఈ ఘటనలో విద్యార్థుల మనోభావాలు ఏమైనా దెబ్బతిన్నాయా? అనే కోణంలో కూడా విచారణ చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల అభిప్రాయాలను సేకరించి.. ఈ మొత్తం పరిణామాలపై నివేదిక ఇవ్వాలన్నారు. తదుపరి చర్యలకు రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ సిఫార్సు చేస్తుందన్నారు.

ఐఐపీఈ విస్తరణ

- ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్‌తో రోడ్ మ్యాప్
- పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, కొత్త కోర్సులపై అధ్యయనం
- 2025 నాటికి శాశ్వత క్యాంపస్ నిర్మాణం పూర్తి
- ఈలోగా రెండో దశ అభివృద్ధికి సన్నాహాలు
- రూ.50 కోట్లతో వివిధ పరిశోధనల ప్రాజెక్టులపై పనిచేస్తున్న ఐఐపీఈ



చురుగ్గా సాగుతున్న అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణ పనులు

సాక్షి, విశాఖపట్నం: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ)ను ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పాతికేళ్ల విస్తరణ ప్రణాళికను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అనుబంధంగా ఉన్న ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (ఈడీసీఐఎల్)కు సంస్థ భవిష్యత్ రోడ్ మ్యాప్ సిద్ధం చేసే బాధ్యతను అప్పగించింది. విస్తరణ ప్రణాళికలో భాగంగా పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, కొత్త కోర్సుల ప్రవేశపెట్టడం తదితర అంశాలపై ఈడీసీఐఎల్ దృష్టి సారించనుంది. మరోవైపు ఐఐపీఈ శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి క్యాంపస్ పూర్తిగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి జరుగుతోంది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో హెచ్‌పీసీఎల్, నక్కపల్లి, రాంబిల్లి పారిశ్రామిక క్లస్టర్లు కీలకమైనవి. జిల్లాకు సమీపంలోని కృష్ణా గోదావరి పరివాహక ప్రాంతం (కేజీ బేసిన్)లో అపారమైన చమురు, సహజవాయువు నిల్వలున్నాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రంగంలో నిపుణులు, నైపుణ్యమున్న సిబ్బంది కొరత ఉంది. ఈ లోటును పూడ్చడంతో పాటు చమురు, ఇంధన రంగ అభివృద్ధికి అవసరమైన పరిశోధనలు పెంచాలనే లక్ష్యంతో విశాఖలో ఐఐపీఈ ఏర్పాటుకు విభజన చట్టంలో భాగంగా కేంద్రం మొగ్గు చూపింది. కేంద్ర చమురు, సహజవాయువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పూర్తి స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేసే ఈ ఇన్‌స్టిట్యూట్‌కు ప్రభుత్వ రంగ సంస్థలైన హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, ఓఎన్‌జీసీ, గెయిల్, ఐఓఎల్ సహకారం అందిస్తున్నాయి. ఏయూలో 2016లో ఐఐపీఈ తాత్కాలిక క్యాంపస్ ఏర్పాటు చేశారు. ఐఐపీఈ శాశ్వత క్యాంపస్ కోసం సబ్బవరం మండలం వంగలి గ్రామ పరిధి సర్వే నంబర్ 135/2లో 147.58 ఎకరాలు, 241/3లో 54.22 ఎకరాల చొప్పున మొత్తం 201.80 ఎకరాలను కేటాయించారు. అప్పట్లో పరిహారం విషయమై ఇబ్బందులు తలెత్తగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వివాదాలను పరిష్కరించడంతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

చురుగ్గా సాగుతున్న పనులు

శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులకు సంబంధించిన ప్రాజెక్టుకు సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీగా వ్యవహరిస్తోంది. కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థకు కాంట్రాక్ట్ బాధ్యతలు అప్పగించారు. 2022లో శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈస్టర్న్ అకాడమీ బ్లాక్, మూడు హాస్టల్ బ్లాక్‌లు, మెస్ బ్లాక్, 8 విభాగాలకు సంబంధించిన క్వార్టర్స్, గెస్ట్ హౌస్, డైరెక్టర్ రెసిడెన్సీ, ఓవర్‌హెడ్ ట్యాంక్ మొదలైన నిర్మాణ పనులు జోరందుకున్నాయి. వచ్చే ఏడాది జనవరి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసి.. జూన్ కల్లా క్యాంపస్ సమగ్రంగా సిద్ధం చేయాలని అధికారులు భావిస్తున్నారు. అందుకనుగుణంగా పనులు చేపడుతున్నారు.

వర్సిటీ రెండో దశ అభివృద్ధికి ప్రణాళికలు

ఐఐపీఈ తొలి దశలో బీటెక్, ఎంటెక్, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ ప్రోగ్రాంలు అందిస్తోంది. బీటెక్‌లో పెట్రోలియం ఇంజినీరింగ్, కెమికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులు ఉన్నాయి. ఒక్కో కోర్సుకు 60 సీట్లు ఉన్నాయి. ఎమ్మెస్సీలో అప్లైడ్ జియాలజీ, ఎంటెక్‌లో ఎనర్జీ ఇంజినీరింగ్ కోర్సులు అందిస్తోంది. వీటితో పాటు అదనంగా ఏమైనా కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలా? సీట్లు పెంపొందించేందుకు ఉన్న అవకాశాలు? మొదలైన అంశాలపై అడ్మిషన్ల పరంగా రోడ్ మ్యాప్ సిద్ధమవుతోంది. అలాగే ఈడీసీఐఎల్.. వచ్చే 25 ఏళ్లకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తోంది. పెట్రోలియం, ఇంధన డొమైన్లలో ఐఐపీఈ అగ్రగామిగా అవతరించేందుకు ఉన్న అవకాశాలపైనా అధ్యయనం కొనసాగుతోంది.

పరిశోధనలపై ప్రత్యేక దృష్టి

రెండో దశలో యూనివర్సిటీ విస్తరణ ప్రణాళికలో పరిశోధనలకు పెద్దపీట వేయాలని భావిస్తున్నారు. నైపుణ్యాభివృద్ధి, కొత్త ప్రోగ్రామ్‌ల ఆఫర్లు, విద్యార్థుల నమోదు, పరిశ్రమల సహకారాలు, అంతర్జాతీయ విద్యా భాగస్వామ్యాలు మొదలైన కీలక అంశాలతో కూడిన వ్యూహాత్మక ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇందుకుగానూ గ్రౌండ్ లెవల్ అసెస్‌మెంట్ నిర్వహిస్తోంది. ఇందుకోసం ఐఐపీఈ అధికారులు, కేంద్ర మంత్రిత్వ శాఖ నిపుణులు, పారిశ్రామిక స్టేక్‌హోల్డర్స్, విద్యా నిపుణులతో ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (ఈడీసీఐఎల్) సంప్రదింపులు జరుపుతున్నారు. ఇప్పటికే రెండో దశ విస్తరణకు సంబంధించి పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ అధ్యక్షతన ఇటీవలే సమీక్ష నిర్వహించి పలు కీలక అంశాలపై చర్చించారు.



ఐఐపీఈ శాశ్వత భవన ప్లానింగ్

పీహెచ్‌డీ స్కాలర్లు పెరుగుతున్నారు



ఐఐపీఈలో పీహెచ్‌డీ స్కాలర్‌ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 2021లో కేవలం నలుగురితో మొదలై ప్రస్తుతం 101కి చేరుకుంది. గత మూడేళ్లలో పరిశ్రమల ప్రాజెక్టుల సంఖ్య 8 నుంచి 30కి పెరగడంతో పారిశ్రామిక సహకారం బలోపేతమైంది. పరిశోధనలకు సంబంధించి మొత్తం రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నాం. నాలుగు పేటెంట్ల కోసం దరఖాస్తు చేసుకున్నాం. 115 పరిశోధన పత్రాలను ప్రచురించాం. గణనీయమైన ఫలితాలతో ప్లేస్‌మెంట్స్ 98 శాతానికి చేరుకుంది. ఈ నేపథ్యంలోనే రెండో దశ అభివృద్ధికి శ్రీకారం చుట్టాం. శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు 2025 జూన్ నాటికి పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

– ప్రొ.శాలివాహన్ శ్రీవాస్తవ, ఐఐపీఈ డైరెక్టర్

స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కన్నుమూత



మస్తానప్ప (ఫైల్)

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్ టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప అనారోగ్యంతో మరణించారు. ఈ ఏడాది మేలో ఉద్యోగ విరమణ చేసిన మస్తానప్ప.. కొంతకాలంగా కిడ్నీ సమస్యతో చికిత్స పొందుతున్నారు. ఇటీవల చికిత్స కోసం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం మరణించారు. ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని ఉక్కునగరంలోని ఆయన నివాసానికి తీసుకొచ్చారు. అంత్యక్రియల కోసం మధ్యాహ్నం 3 గంటలకు ఆయన మృతదేహాన్ని స్వస్థలం గుంతకల్లుకు తరలించారు. ఆయన భార్య వై.వరలక్ష్మి గాజువాక మున్సిపల్ కౌన్సిలర్‌గా పని చేశారు. ఆయనకు కుమార్తె ఉన్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన మస్తానప్ప1987 డిసెంబర్‌లో స్టీల్‌ప్లాంట్‌లో జూనియర్ ట్రైనీగా చేరారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమాని అయిన ఆయన కాంగ్రెస్ సానుభూతిపరుడిగా మొదట ఐఎన్‌టీయూసీలో చేరారు. ఆ యూనియన్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ స్థాయికి ఎదిగారు. వైఎస్సార్ సీపీ ఏర్పాటుతో.. అనుబంధ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్ టీయూసీ ప్రధాన కార్యదర్శిగా మొదటి నుంచి కొనసాగుతున్నారు. అందరివాడిగా పేరొందిన మస్తానప్ప మృతి చెందిన విషయం తెలిసి పలువురు ఉద్యోగులు కన్నీటిపర్యంతమయ్యారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నర్సింగరావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, వై.టి.దాస్, ఎన్.రామారావు, అయోధ్య రామ్, సంపూర్ణం, రామస్వామి, అసోసియేషన్ల నాయకులు, ఉద్యోగులు మస్తానప్ప భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



మస్తానప్ప మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

డివైడర్‌ను ఢీకొని టెక్ మహీంద్రా ఉద్యోగి మృతి



క్రాంతికుమార్ (ఫైల్)

పీఎంపాలెం: రోడ్డు ప్రమాదంలో టెక్ మహీంద్రా ఉద్యోగి మృతి చెందాడు. పీఎంపాలెం సీఐ బాలకృష్ణ అందజేసిన వివరాలు..మధురవాడ నగరంపాలెం రోడ్డులో నివసిస్తున్న మతాల రమాప్రభ స్థానికంగా ఓ స్కూలులో టీచర్‌గా పని చేస్తుండగా భర్త శ్రీకాకుళం కొత్తూరులో వ్యవసాయం చేస్తున్నాడు. ఆమెకు ఇద్దరు కొడుకులు.. చిన్న కొడుకు క్రాంతికుమార్ (21) టెక్ మహీంద్రాలో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో క్రాంతికుమార్ అతని స్నేహితుడు కోమల్‌తో కలిసి ఐటీ సెజ్ వైపు బైకుపై వెళుతుండగా డివైడర్‌ను బలంగా ఢీ కొట్టింది. కొన ఊపిరితో ఉన్న క్రాంతికుమార్‌ను గీతం ఆస్పత్రికి తరలించగా..అప్పటికే మృతి చెందాడు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఆచూకీ చెప్పండి.. రివార్డు పొందండి



ఈ క్యాప్షన్ చూస్తే.. ఏదైనా విలువైన వస్తువు లేదా కుటుంబ సభ్యుడు కనిపించడం లేదని అనుకుంటే పొరపాటు పడినట్లే. ఎంతో ఇష్టంగా, ప్రేమగా పెంచుకుంటున్న పిల్లి కోసం దాని యజమాని పడుతున్న తాపత్రయం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. 'రాకీ కనిపించడం లేదు. దానిని ఎవరైనా చూశారా? ఆచూకీ చెప్పిన వారికి రూ.5 వేల రివార్డ్ అందిస్తాం' అని బ్యానర్ కట్టి మరీ దాని యజమాని వెతుకుతుండడం గమనార్హం.

-ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కన్నీటితో సమాధుల పండగ



సమాధులు వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

డాబాగార్డెన్స్/కంచరపాలెం: చనిపోయిన తమ కుటుంబ సభ్యుల ఆత్మలకు శాంతి కలగాలని శనివారం జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు సమస్త పరిశుద్ధ ఆత్మల పండగ దినోత్సవం నిర్వహించారు. సమాధుల దగ్గర ప్రత్యేక ప్రార్థనలు చేయడం ద్వారా చనిపోయిన తమ వారి ఆత్మలకు శాంతి కలుగుతుందని క్రైస్తవుల నమ్మకం. ఏటా నవంబర్ 2న ప్రపంచవ్యాప్తంగా రోమన్ కేథలిక్‌లు ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన ఆలయంలో ఉదయం దివ్యబలి పూజలు నిర్వహించారు. జ్ఞానాపురం ప్రాంతంలోని జోన్నాడ జాన్ ప్రకాశ్ నేతృత్వంలో సమాధి ఉత్సవాలు జరిగాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సమీపం వాల్తేర్ సెమిట్రీలోని సమాధులను శుభ్రపరిచి, పువ్వులతో అలంకరించారు. కొవ్వొత్తులు వెలిగించి సమాధుల ఎదుట 'డైస్ ఐరే' అనే లాటిన్ పాటను పాడుతూ.. చనిపోయిన వారిని స్మరించుకున్నారు. జ్ఞానాపురం శ్మశాన వాటికలోని సమాధుల వద్ద అల్లిపురం, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, మర్రిపాలెం, ఎన్ఏడీ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పునీత పేతురు దేవాలయం ఫాదర్లు వినయ్‌కుమార్, ఆంతోనీ, రాజ్, రాజశేఖర్ శ్రీధర్, ఆలిండియా కేథలిక్ యూనియన్ సభ్యులు, పీపీసీ సభ్యులు పాల్గొన్నారు.



సమాధులపై వాలిన కాకులు



వాల్తేర్ సెమిట్రీలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ కుటుంబం

టీచర్లకు అందని జీతాలు?

- ఆదివారం జమ కావడం అనుమానమే..
- పెన్షనర్స్‌కు తప్పని వెతలు
- సామాజిక మాధ్యమాల్లో కూటమి ప్రభుత్వంపై సెటైర్లు

విశాఖ విద్య: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అప్పుడే మాట తప్పింది. ఉపాధ్యాయులకు అక్టోబర్‌కు సంబంధించిన వేతనాలు ఇంకా బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. ఈ నెల 3న ఆదివారం సెలవు కావడంతో సోమవారం తర్వాతే మోక్షం కలిగే అవకాశం ఉంది. దీంతో కూటమి ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయులు సామాజిక మాధ్యమాల్లో సెటైర్లు వేస్తున్నారు. జూలైలో 1న జీతాలు చెల్లించి, తాము ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెప్పినా, ఆగస్టులో 2న, సెప్టెంబర్‌లో 3న, అక్టోబర్‌లో 4న, తాజాగా అక్టోబర్‌కు సంబంధించి ఈ నెల 5న వేతనాలు పొందుతున్నామని సామాజిక మాధ్యమాల్లో వ్యంగ్యంగా పోస్టింగ్‌లు పెడుతున్నారు. ఉపాధ్యాయ వర్గం మరలా నిరాదరణకు గురవుతోందని, ఒక్క విద్యాశాఖలోనే ఇలాంటి దౌర్భాగ్యమని, ఇలా అయితే ఈఎంఐలు, ఇంటి అద్దెలు, పిల్లలు ఫీజులు సమయానికి కట్టేదెలా అంటూ మరో వాట్సాప్ గ్రూప్‌లో ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. జీతాలు అడుక్కోవడం ఏంటి..? అది మీ హక్కు అన్న వారే..ఆ మాట మరిచిపోతున్నారని మరికొంతమంది ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని కొన్ని శాఖల ఉద్యోగులకు వేతనాలు జమ అయినప్పటికీ, టీచర్లకు సంబంధించిన బిల్లులపై క్లారిటీ లేకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. సీఎఫ్ఎంఎస్ సైట్‌లోని వేతనాలకు సంబంధించిన ఈ కుబేర్‌లో 'వెయింటింగ్ ఫర్ ఫండ్'అని చూపిస్తోందని, దీంతో ఈ నెల 5 తర్వాతనే మాకు జీతాలు అంటూ ఓ ఉపాధ్యాయ సంఘం నేత తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు చెప్పిన మాటలకు, తాజాగా అవలంబిస్తున్న విధానాలకు చాలా తేడా ఉందని మరో ఉపాధ్యాయ సంఘం నాయకుడు చెప్పారు. మొత్తంగా ఉమ్మడి విశాఖ జిల్లా విద్యాశాఖలోని బోధన, బోధనేతర ఉద్యోగులు 10 వేల మందికిపైగా అక్టోబర్ వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. మరోపక్క పెన్షనర్లకు సైతం ఒక్కొక్కరిగా జమ అవుతుండటంతో వారు సైతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సింథటిక్ ట్రాక్, క్రీడా వసతులు కల్పించండి

విశాఖ స్పోర్ట్స్: విశాఖలో అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్, క్రీడా వసతులు కల్పించాలని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ రవినాయుడుకు విజ్ఞప్తి చేశారు. శనివారం విశాఖ విచ్చేసిన శాప్ చైర్మన్‌కు ది ఒలింపిక్ సంఘం తరపున కార్యదర్శి సూర్యనారాయణ, జిల్లా అథ్లెటిక్ సంఘం తరపున కార్యదర్శి నారాయణ వినతి పత్రాలు అందజేశారు. జిల్లాలో ఒలింపిక్ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని, మౌలిక వసతులతో పాటు క్రీడాప్రాంగణాల్ని ఔత్సాహిక క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.